క్లుప్తంగా

ధీరోదాత్తుడు ప్రకాశంపంతులు



ప్రకాశం పంతులకు నివాళులర్పిస్తున్న డీఆర్డీఏ పీడీ, ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): ధీరోదాత్తుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు అన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్ విజయరాజు డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన గొప్పతనాన్ని గుర్తుచేసుకున్నారు.

పౌష్టికాహారంతోనే ఎదుగుదల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏలూరు సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని ఏలూరు అర్బన్ సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక 41వ డివిజన్లోని రహమత్ నగర్, జయప్రకాష్ సెంటర్ అంగన్వాడి కేంద్రంలో శనివారం ఈసీసీ డే నిర్వహించారు. ముఖ్యఅతిథి పద్మావతి మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తేనే ఎదుగుదల సక్రమంగా ఉంటుందని వివరించారు. పిల్లల్లో అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జోషి, అంగన్‌వాడీ కార్యకర్తలు నవతి, ఝాన్సీ లక్ష్మి, ఆదిలక్ష్మి, హేమలత, ప్రీస్కూల్ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య సమాజానికి కృషి



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: సంపూర్ణ ఆరోగ్య సమాజం ఆవిర్భావానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారులు ప్రదీప్, కృష్ణ అన్నారు. శనివారం ఏలూరు మండలం చాటపర్రులో పీహెచ్‌సీ ఎంపీహెచ్ఓ రామాంజనేయులు వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీరు నిల్వలు ఉండకుండా, దోమల వ్యాప్తి చెందకుండా వ్యక్తిగత చర్యలు చేపట్టాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం

ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: స్వాతంత్ర్య సమరయోధునిగా, ప్రముఖ న్యాయవాదిగా, రాజకీయవేత్త, ప్రజాహిత సేవకునిగా బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన పోరాటం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని, ఆయన జీవితం స్ఫూర్తిగా తీసుకుని యువత దేశాభివృద్ధికి, సమైఖ్యతకు పాటుపడాలని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పిలుపునిచ్చారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం శనివారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

ఏలూరు జిల్లాలోని కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఏపీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భర్తీ చేస్తోన్న కానిస్టేబుల్ పోస్టులకు తాత్కాలిక జాబితాలో ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనను సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్లో ఎస్పీ శివకిషోర్ ఆదేశాల మేరకు చేపట్టారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. ధ్రువీకరణ శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభమైంది. ఈనెల 24న ఆదివారం రెండో రోజు కొనసాగుందని ఏఎస్పీ తెలిపారు.

సత్వర న్యాయమే లక్ష్యం

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు నేరాలకు పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్షలు విధించేలా న్యాయస్థానాలకు పక్కా సాక్షాధారాలను, సాక్షులను ప్రవేశపెట్టేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం పోలీస్ సబ్ డివిజన్లకు సంబంధించి కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులు హాజరయ్యారు. నేరస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోకూడదని, బాధితులకు న్యాయం జరిగే వరకూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని సాక్ష్యాలను కోర్టులో సమర్పించాలని ఆదేశించారు.



మత్తు వద్దు.. ఎన్‌డీపీఎస్ చట్టాల పోస్టర్ విడుదల చేస్తున్న ఏఎస్పీ, సీఐలు, ఎస్సైలు



కోర్టు మానిటరింగ్ సెల్ సమీక్షకు హాజరైన పోలీస్ అధికారులు

చట్టాలపై అవగాహన

ఎస్పీ శివకిషోర్ ఆదేశాలపై అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఈగల్ సీఐ జి.రవి కుమార్ ఎన్‌డీపీఎస్ చట్టాలు, వాటి అమలుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ఎస్సైలు, సీఐలు ఈ శిక్షణా శిబిరానికి హాజరయ్యారు. ఎన్‌డీపీఎస్ చట్టాల సమగ్ర అమలుకు తొలుత వాటిపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. సే నో టూ డ్రగ్స్, డ్రగ్స్ వద్దు బ్రో, ఈగల్ క్లబ్స్ ఇలా పలు రకాల ప్లకార్డులు, పోస్టర్లను అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, సీఐలు విడుదల చేశారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ హబీబ్ బాషా, ఏలూరు త్రీటౌన్, పెదవేగి, జీలుగుమిల్లి, నూజివీడు రూరల్, కుక్కునూరు సీఐలు కోటేశ్వరరావు, సీహెచ్ రాజశేఖర్, వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, ఎం రమేష్‌బాబు, ఏలూరు ఈగల్ ఆర్ఎస్ఐ ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలి



రైతు బజారులో అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని స్థానిక పత్తేబాద రైతు బజారు ఎస్టేట్ అధికారి వినోద్ బాబు అన్నారు. శనివారం స్థానిక పత్తేబాద రైతు బజారు వద్ద పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ బాబు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత లోపించి ఇటీవల అనేక ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు ప్లాస్టిక్ వినియోగంలో స్వీయ నియంత్రణ ఒక్కటే మార్గమని చెప్పారు. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రజలంతా కట్టుబడి ఉండాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంలో భాగంగా రైతు బజారులో ప్లాస్టిక్ కర్ల వినియోగాన్ని నిషేధించామని తెలిపారు. రైతు బజారుకు వచ్చే వినియోగదారులు గుడ్డ సంచులు తెచ్చుకుని ప్లాస్టిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలని సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలోని నిర్వహించిన ఈ ర్యాలీలో రైతులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

వినాయక మట్టి ప్రతిమలపై అవగాహన



మార్కెట్ యార్డులో ప్రచారం చేస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వినాయక చవితి పండుగను పర్యావరణ హితమైన పండుగగా నిర్వహించుకోవాలని, పూజలో కేవలం మట్టి వినాయక ప్రతిమలనే వాడాలని కళాజాత ద్వారా కళాకారుల బృందం నగరంలో వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేసింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఏలూరు ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కళాకారులు మట్టి గణపతి ప్రతిమల వినియోగంపై ప్రచారం చేశారు. పీఓపీతో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, జల కాలుష్యం అవుతుందని వివరించారు. వినాయక చవితి ఊరేగింపులో డీజే సౌండ్స్ నిషేధమని, ప్రజలంతా పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని, వాయు కాలుష్యాన్ని తగ్గించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని నగరంలోని ఎస్ఎస్ హైస్కూల్, ఏలూరు మార్కెట్ యార్డుల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరుకు చెందిన ఎం శ్రీదివ్య కల్చరల్ సొసైటీ కళాజాత బృందం సభ్యులు ఎం కుమార్, ఎం తిరుపతి ఆయా అంశాలపై జానపద గేయాల రూపంలో ప్రచారం చేశారు.

సురవరం మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): సీపీఐ అగ్ర నేత, మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతికి ఏఐటీయూసీ ఏలూరు జిల్లా సమితి సంతాపం వ్యక్తం చేసింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిషోర్‌లు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచే వామపక్ష రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. ప్రజా ఉద్యమాల్లో అరెస్టై లక్నో, కోల్‌కత్తా జైళ్లలో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ ఎంపీగా రెండు పర్యాయాలు ఎన్నికయ్యారన్నారు. 2004లో పార్లమెంటు కార్మిక శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేశారని తెలిపారు. సుధాకర్ రెడ్డి మృతి సీపీఐకే కాకుండా, వామపక్ష, కార్మిక ఉద్యమాలకు తీరని లోటని వివరించారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం

- మరణిస్తే రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు
- 14 బాధిత కుటుంబాలకు రూ.26.50 లక్షలు అందజేత
- ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్



14 మంది బాధిత కుటుంబాలకు పరిహారం అందజేసిన ఎస్పీ శివకిషోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదాల్లో హిట్ అండ్ రన్ కేసుల్లో మృతిచెందిన, క్షతగాత్రులైన వారి కుటుంబాలకు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి పరిహారాన్ని మంజూరు చేయించి, బాధిత కుటుంబాలకు నగదును చెక్కుల రూపంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అందజేశారు. ఎప్పుడూ లేని విధంగా ప్రత్యేక శ్రద్ధతో ఎస్పీ తమకు న్యాయం చేయటంపై బాధిత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి. సుప్రీమ్ కోర్టు ఉత్తర్వుల మేరకు మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్, హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి జిల్లాలోని 14 కుటుంబాలకు రూ.26,50,000 చెక్కులను ఎస్పీ చేతులమీదుగా శనివారం అందజేశారు.

సొమ్ము పంపిణీ ఇలా

భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో హిట్ అండ్ రన్ కేసులో బోడిగడ్ల వెంకటేశ్వరరావుకు రూ.2 లక్షలు, దెందులూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మహ్మద్ మురాద్‌కు రూ.2 లక్షలు, మిద్దే వీర్రాజుకు రూ.2 లక్షలు, ఏలూరు టూటౌన్ పరిధిలో తిరాండి నాగమణికి రూ.2 లక్షలు, ఏలూరు త్రీటౌన్ పరిధిలో షేక్ కలీషా రూ.2 లక్షలు, జంగారెడ్డిగూడెం స్టేషన్‌లో సయ్యద్ రహమాన్ అండ్ షయ్యాన్‌కు రూ.2 లక్షలు, కొండపల్లి మంగతాయారుకు రూ.2 లక్షలు, పసుపులేటి రామకృష్ణకు రూ.2 లక్షలు, కొర్సా కృష్ణకు రూ.2 లక్షలు, కలిదిండికి చెందిన యల్ల మార్తమ్మకు రూ.2 లక్షలు, కొయ్యలగూడెంకు చెందిన ఉద్దగిరి రాజ్‌కుమార్‌కు రూ.2 లక్షలు, ముదినేపల్లికి చెందిన పోలా సత్తెనర్సమ్మకు రూ.50 వేలు, నూజివీడు టౌన్‌కు చెందిన తోట వీరబాబుకు రూ.2 లక్షలు, పెదవేగికి చెందిన తాడేపల్లి సలోమీ రాణికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం అందజేశారు. బాధిత కుటుంబాలు పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఉన్నారు.

కలెక్టరేట్‌లో పరిసరాల పరిశుభ్రత



కలక్టరేట్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్యాలయ సిబ్బంది

ఏలూరు(మెట్రో): స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో శనివారం కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. కలెక్టరేట్ పరిసరాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు రవి కుమార్, చల్లన్న దొర, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొని చెత్తను, డ్రెయిన్లలో మురుగును తొలగించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఏలూరు (టూటౌన్) : పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కోరారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక 36వ డివిజన్ గుడివాడ వారి వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో వర్షాకాలం – పరిశుభ్రత, వచ్చే వ్యాధులు – తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వల తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ విజయకుమార్‌రాజు

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు చాటపర్రు కోపరేటివ్ సొసైటీలో యూరియా నిల్వ తనిఖీ చేశారు. అమ్మకాలు, నిల్వలపై కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు సొసైటీ సిబ్బంది జవాబుదారీగా ఉండాలని, ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛంద కార్యక్రమాన్ని మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, గ్రామస్తులతో కలిసి ఆయన నిర్వహించారు. రోడ్ల పక్కన ఉన్న చెత్తను ఎత్తివేసి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ఎంపీడీఓ శ్రీలత, అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పోష్ యాక్ట్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై నాగమణి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటీ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో పోష్ యాక్ట్ 2013పై శనివారం అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అధ్యక్షతన ఏర్పాటుచేశారు. బాలికలు, స్త్రీలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహార చర్యల ప్రాముఖ్యతను గిరిబాబు వివరించారు. కోఆర్డినేటర్ టీబీఎస్ పద్మావతి ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటీ విధులను వివరించారు. న్యాయవాది స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.అమర శ్రీనివాస్ పోక్సో యాక్ట్ ముఖ్య అంశాలను, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై నాగమణి సమాజంలో వారు ఎలా ప్రవర్తించాలి, మొబైల్ అతిగా వాడటం వల్ల కలిగే నష్టాలు, శక్తి యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్, అధ్యాపకులు సుస్యలత, సుజాత, దుర్గాప్రసాద్, విజయకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో 1400 కౌలు కార్డులు

దెందులూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న 1400 కౌలు రైతు కార్డులు త్వరితగతిన మంజూరు చేయాలని తహసీల్దార్ బి.సుమతి ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలం వ్యవసాయ శాఖ అధికారి ఎల్ శ్రీనివాసరాజు అధ్యక్షతన మండలంలోని వ్యవసాయ శాఖ అధ్యక్షులతో సుమతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఓ శ్రీనివాసరాజు మాట్లాడారు.

చెరువులకు నీరందించేందుకు కృషి

భీమడోలు: పోలవరం కుడి కాల్వ నుంచి పోలసానిపల్లి లింకు చెరువులకు నీరందించేందుకు కృషి చేస్తానని మైనర్ ఇరిగేషన్ ఏఈ కె.లాజర్‌బాబు అన్నారు. గత నెల 28న లింక్ చెరువులకు కుడి కాల్వ నుంచి నీరందించి రైతులను ఆదుకోవాలని గ్రామ మాజీ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత అంబటి నాగేంద్రప్రసాద్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వీరవల్లి ఏడుకొండలు, రైతులు తామ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏఈ విచారణ చేశారు. పోలవరం కుడి కాల్వ నీటిని లింకు చెరువులకు చేరేందుకు ఏర్పాటు చేయాల్సిన తూము ప్రాంతాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. పోలవరం కుడి కాల్వ పరిధిలోని 12 లింకు చెరులకు నీరందించేందుకు కాల్వ గట్టుపై యూటీని నిర్మిస్తే పంట పొలాలకు పుష్కలంగా నీరందుతుందని, ప్రస్తుతం పైపుల ద్వారా నీటిని తరలించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, పోలవరం కుడి కాల్వ నీటి మట్టాలు లేనప్పుడు తమ బాధలు వర్ణనాతీతమని రైతులు వాపోయారు. దీనిపై ఏఈ సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారులు, పోలవరం కుడి కాల్వ అధికారుల దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రైతులు కోట శంకర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలి

భీమడోలు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను మరింత పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ పీజే అమృతం అన్నారు. పూళ్ల పీహెచ్‌సీని ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లును పరిశీలించారు. ఆసుపత్రుల్లోని ప్రసవాలు, ఇన్, అవుట్ పేషెంట్ల వివరాలను వైద్యాధికారిణి అరుణజ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డెలివరీ అయిన వారితో ఆమె మాట్లాడి, ఇక్కడ సదుపాయాలపై ఆరా తీశారు. రోగుల అభిప్రాయాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



గంగరాజు మృతదేహం వద్ద పూలమాల వేస్తున్న జేపీ

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి మున్నల జాన్‌గురునాథ్ బావమరిది నల్ల గంగరాజు మృతిచెందారు. ఏలూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) వారి స్వగృహానికి వెళ్లి గంగరాజు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. జేపీ వెంట పార్టీ నేతలు పాల్గొన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ నాయకురాలు తులసీ వర్మను కూడా నేతలు పరామర్శించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చదువుల్లో ప్రతిభ చూపుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్థానిక శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన ఈర్ల కోమల రాణికి చదువు నిమిత్తం శనివారం సీఆర్ రెడ్డి ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.సరళ చేతుల మీదుగా రూ.10 వేలు, శనివారపేట జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శనివారపేటకు చెందిన కొండపల్లి కావ్యకాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సాయి హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు గుగ్గిలోతు కృష్ణ, డీకేఎస్ఎస్ ప్రకాష్, వి.రాంబాబు, యిద్దం శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, మానవత ఫౌండేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం అజయ్ బాబు, సీహెచ్ గణేష్, కాలేషా, ప్రధానోపాధ్యాయులు గారపాటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	28	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	32	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	38	కంద	00
కాకర కాయలు	24-30	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	18-24	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	18
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు – తిరుపతి	16.00	4830	31